గోపాలరావు ఆఫీసుకు వెళ్లబోతూ కొడుకుని చూసి హాల్లో ఆగాడు.

"ఈ నెల జీతం నాన్నా!" అన్నాడు కొడుకు శంకరం.

# పరివర్తన

## టెంపోరావ్

శంకరం యిచ్చిన ఐదు వంద రూపాయిల నోట్లను తీసుకుని అతడి వైపు నవ్వుతూ చూశాడు.

"యాభై నే నుంచుకున్నాను, నా ఖర్చులకు," అన్నాడు శంకరం.

గోపాలరావు సైలెంట్‌గా చూశాడు. వెనక్కి వెళ్ళి డబ్బును బీరువాలో పెట్టాడు. తన ప్లాస్టిక్ బాగ్ పట్టుకుని యింట్లోంచి బయటకు నడిచాడు.

గోపాలరావు ఒక ప్రయివేట్ యింజనీరింగ్ కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అతడికి యిద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు.

పెద్దవాడు శంకరం. అతడికి చదువు అబ్బలేదు. రెండుమూడేళ్ల డింకీలు కొట్టి చదువు మానేశాడు. బాగుపడేయోగం అతడికి లేదని విచారిస్తూ తండ్రి వూరుకున్నాడు.

శంకరం పొద్దుటే పోయేవాడు. రాత్రి ఆలస్యంగా వచ్చేవాడు. అతడు ఏం చేస్తున్నాడో ఎవ్వరికీ తెలియదు.

అటువంటి శంకరం ఆరునెలల క్రితం ఒకనాడు తండ్రిముందు కొచ్చి అతడికి వినయంగా ఐదు వందలు యిచ్చాడు.

"ఏమిట్రా యిది?" అన్నాడు గోపాలరావు.



"నా జీతం, నాన్నా. 550 యిస్తారు. యాభై నా ఖర్చుల కుంచుకుని 500 యిచ్చాను," అన్నాడు శంకరం.

"ఉద్యోగం వచ్చినట్లు యింతవరకు నాకు చెప్పలేదే?"

శంకరం తీయగా నవ్వాడు.

"మీకు సర్‌ప్రైజ్ యిద్దామని చెప్పలేదు."

"ఎక్కడ వుద్యోగం?"

"నా ఫ్రెండ్ నవీన్ వున్నాడుగా, అతడి ఫాక్టరీలో. ఇప్పుడా ఫాక్టరీని నవీన్ నడుపుతున్నాడు. సేల్స్ ఆఫీసర్‌గా నాకు వుద్యోగం యిచ్చాడు."

"మంచిది, వచ్చిన వుద్యోగాన్ని నిలుపుకో!" అన్నాడు తండ్రి.

గోపాలరావు సంతోషించాడు. పైకి నిర్లక్ష్యంగా అగుపడినా లోలోపల శంకరం గురించి అతడు బెంగపెట్టుకుని బాధపడేవాడు. ఇప్పుడిక బెంగలేదు.

శంకరం వుద్యోగం సంపాదించాడు. తన పని సవ్యంగా చేసుకుపోతే రెండు మూడేళ్లలో స్థిరపడిపోతాడు.

బస్టాండుకు నడుస్తూ గోపాలరావు తన కొడుకు భవిష్యత్తు గురించే ఆలోచించసాగాడు. మూర్తిరాజు కుమార్తె రేఖని శంకరానికిచ్చి పెళ్ళి చేస్తే యిద్దరూ సుఖంగా వుంటారు. పెళ్లి విషయం తన కొలీగ్ మూర్తిరాజుతో మాట్లాడాలి.

లంచ్ సమయంలో ఆఫీసులోంచి బయటకు నడిచి సమీపంలో వున్న హోటల్లోకి ప్రవేశించారు మిత్రులిద్దరూ. ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నారు.

"ఒరేయ్ రాజూ, అబ్బాయి పెళ్లి విషయం నీతో మాట్లాడాలిరా," అన్నాడు గోపాలరావు.

"ఒరేయి గోపాల్, దానికేముందిరా? ఇది మనం ఎప్పుడూ అనుకునేదేగా! నువ్వు సరేనంటే ముహూర్తం పెట్టిస్తాను," అన్నాడు మూర్తిరాజు.

ఇద్దరూ కాఫీ తాగారు.

"ఎందుకేనా మంచిది, వాడితో మాట్లాడి నీకు చెప్తాను."

"రేఖ కోసం అతను తరుచు మా యింటికి వస్తూంటాడు. అయినా అడిగి చూడు!" అన్నాడు మూర్తిరాజు.

గోపాలరావు బస్సులో నిలబడి వున్నాడు. బస్సు జనంతో క్రిక్కిరిసి వుంది. ఇసుక వేస్తే క్రింద రాలనంతగా మనుషులు నుంచున్నారు.

ఆఫీసు పనితో అలసిపోయిన గోపాలరావు తొందరగా యిల్లుచేరుకోవాలనే ఆత్రంతో చెమటలు పోసినా లెఖ్ఖ చేయకుండా అలాగే నుంచున్నాడు.

బస్సు ఆగుతోంది. కదుల్తోంది. గోపాలరావు కళ్లుమూసుకుని ఆలోచిస్తున్నాడు.

ప్రతిరోజూ యీ బస్సులో గంటసేపు ప్రయాణం చేసి, ఆఫీసుకు వెళ్లి రావాలి!

"నా పర్స్! ఎవరో కొట్టేశారు! నా పర్స్" గట్టిగా అర్చాడు, గోపాలరావు పక్కన నిలబడిన రామోజీ.

బస్సులోని వాళ్లందరూ వులిక్కిపడ్డారు. అందరి చేతులూ వాళ్ల పర్సుల వైపు దూసుకుపోయాయి.

కండక్టర్ విజిల్ వేశాడు.


"ఎవర్నీ బయటకు పోనీయకండి! దొంగనాకొడుకు దొరుకుతాడు!" కండక్టర్ గంభీరంగా అర్చాడు.

బస్సు కదుల్తోంది. ప్రజలు ఒకళ్లనొకళ్లు అనుమానంతో చూస్తున్నారు. పర్సు పోగొట్టుకున్న రామోజీ బ్లేడుతో కోసిన తన హిప్‌పోకెట్‌ను వేళ్లతో తడుముకున్నాడు.

"పైనుంచి కిందకు జేబును కోసేవాడు!" అన్నాడొక వ్యక్తి.

రామోజీ నలువైపులా చూశాడు. పక్క నిలబడిన గోపాలరావు చేతిలో వున్న బాగ్‌పైపు అతడి చూపు వెళ్లింది.

బాగ్ పైనున్న సైడ్ పోకెట్ జిప్పర్ పక్కకు లాగబడి వుంది. అందులోంచి






ఏదో నల్లగా కనిపిస్తోంది!

"అదో నా పర్స్! నా పర్స్!" అర్చాడు రామోజీ.

"ఎక్కడ?" అడిగాడొకతను.

"వాడి బాగ్‌లో!" అన్నాడు రామోజీ గోపాలరావు వైపు చూపిస్తూ. కనిపిస్తోంది. కండక్టర్ అక్కడకు తోసు కొచ్చాడు. బాగ్‌లో వున్న పర్స్‌వైపు చూశాడు.

రామోజీ పుద్రిక్తుడయ్యాడు. ఎడం చేత్తో గోపాలరావు మెడను బిగించి పట్టుకుని కుడిచేత్తో బలంగా చెంపమీద వాయించాడు.

"దొంగ రాస్కెల్, పెద్దమనిషిలా వేషం వేసుకుని నా జేబు కోస్తావుట్రా!" అర్చాడు రామోజీ.

గోపాలరావు బాధతో మూలిగాడు. మరో యిద్దరు దబదబ గోపాలరావును బాదారు. నోరువిప్పే అవకాశం గోపాలరావుకి చిక్కలేదు.

"వాడిని చంపకండి; పోలీసులకు అప్పగించండి," అన్నాడు కండక్టర్ అడ్డొస్తూ.

గోపాలరావు దీనంగా కండక్టర్ వైపు చూశాడు.

"ఆ పర్సును ఎవరో నా బాగ్‌లో పడేసి వుంటారు. నాకేమీ తెలియదు. నేను పెద్దమనిషిని, నిర్దోషిని," అర్చాడు గోపాలరావు.

"లోకంలో ఏ దొంగైనా తను దొంగనని ఒప్పుకుంటాడా?" గద్దించాడు రామోజీ.

బస్సు పోలీసు స్టేషన్ ముందు ఆగింది. రామోజీ గోపాలరావులను కండక్టర్ కిందకు దింపి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాడు.

సబిన‌స్పెక్టర్ రంగారావు బాగ్‌లోని పర్సును పైకి తీసి, తెర్చి చూశాడు. పర్సులో ఎనిమిది వందల పైనుంది.

సబిన‌స్పెక్టర్ అంతా విని గోపాలరావు వంక చూశాడు. అతడి వయస్సు యాభై వుండొచ్చు. పెద్దమనిషిలా అగుపిస్తున్నాడు. "ఆ పర్సు గురించి మీరు ఏం చెప్తారు?" అడిగాడు సబిన‌స్పెక్టర్.

అవమానానికి బలైన గోపాలరావు కళ్లు నీళ్లతో నిండాయి. "ఇది ఎలా జరిగిందో నేను చెప్పలేను. కానీ ఆయన జేబు నేను కోయలేదు, పర్సు నేను తీయలేదు. నేను మర్యాదగా బతికే వ్యక్తిని. నాకు భార్యా, ఐదుగురు పిల్లలూ వున్నారు. నేను భారత్ యింజనీరింగ్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నాను. మా కంపెనీ యజమాని దేవేందర్ గారికి ఫోన్‌చేసి నా గురించి అడగండి, అంతా మీకే తెలుస్తుంది," అన్నాడు గోపాలరావు.

అతడు యిచ్చిన నంబర్‌కు సబిన‌స్పెక్టర్ ఫోన్‌చేసి దేవేందర్‌తో మాట్లాడి, రిసీవర్ని పెట్టేశాడు. సూటిగా రామోజీ వైపు చూశాడు. "మిస్టర్, మీ జేబు కొట్టిన వ్యక్తి ఈయన కాదు. దేవేందర్ గారు చెప్పింది విన్నాక ఆయనకు ఫోన్ చేసినందుకు బాధపడ్డాను. ఈయన యిరవై అయిదేళ్ళుగా ఆ కంపెనీలో పనిచేస్తున్నారు. నిజం తెలుసుకోకుండా ఆయనమీద నేరం ఆరోపించినందుకు మీరు సిగ్గుపడాలి!"

రామోజీ విచారవదనంతో గోపాలరావువైపు చూశాడు. "కోపంలో జంతువులా ప్రవర్తించాడు. నన్ను క్షమించండి!" అన్నాడతను.

"డోంట్ బాదర్! ఒక్కోసారి నిర్దోషులు నిందలపాలవుతూ వుంటారు. అది నా ఖర్మ! మీ తప్పు లేదు," అన్నాడు గోపాలరావు.

రామోజీ తన పర్సు తీసుకున్నాడు.

"గోపాలరావుగారూ, మీరు వెళ్లొచ్చు. జరిగిందానికి నేను విచారిస్తున్నాను," అన్నాడు సబిన‌స్పెక్టర్.

హాల్లో లైటు వెలుగుతోంది. గదిలోకొచ్చిన భర్తవైపు సుమిత్ర అదోలా చూసింది. గోపాలరావు కుర్చీలో కూలబడ్డాడు.

"ఏమైందండీ, ఎలాగో వున్నారు?" అందామె.

"మంచినీళ్లు పట్రావే!"

గ్లాసులో నీళ్లు తెచ్చియిచ్చిందామె. అతను గడగడ నీళ్లు తాగేశాడు. దెబ్బలతో కుడికన్ను పక్కన నల్లబడింది.

గోపాలరావు భార్యవైపు సూటిగా

చూశాడు. అతడి కళ్లమ్మట నీళ్లుకారాయి.

"ఏమైందో చెప్పండి!" అందామె.

పక్కగదిలోంచి శంకరం గబగబా వచ్చి తండ్రి కాళ్లముందు బోర్లాపడ్డాడు. ఏడుస్తూ తండ్రి కాళ్లను పట్టుకున్నాడు.

"నాన్నా, అదే బస్సులో వుండి, వాళ్లు మిమ్మల్ని కొడ్తూంటే గుండె దడతో కదలకుండా నిలబడిననిర్భాగ్యుడ్ని నేను! నేను చేసిన నేరానికి మీరు శిక్ష అనుభవించారు!"

గోపాలరావు ఆశ్చర్యంగా కొడుకు వైపు చూశాడు.

"ఏమిట్రా నువ్వనేది?"

"నాకు వుద్యోగం రావడం అబద్ధం నాన్నా. నవీన్‌తో స్నేహంచేసి జేబు దొంగగా రూపం దాల్చాను. అనేక మంది జేబులు కొట్టి డబ్బులాగుతున్నాను. నెల మొదట్లో నా జీతం అని అబద్ధం ఆడి ఐదు వందలు మీ కిస్తున్నాను!"

హాల్లో నిశ్శబ్దంగా వుంది. శంకరం చెల్లెళ్లు నిలబడి అంతా వింటున్నారు.

"అతడు హిప్ పోకెట్‌ను బ్లేడుతో కోసి పర్సు లాకున్నాను. అతడు వెంటనే గుర్తించి అర్చాడు. ఆ పర్సులో ఎన్నో వందరూపాయిల నోట్లున్నాయి. ఏం చేయాలా ఆలోచిస్తూండగా మీరు కనిపించారు. మీకు తెలియకుండా మీ బాగ్ జిప్పర్‌లాగి లోపలకు పర్సును తోశాను. నా ఖంగారులో ఆ జిప్పర్ మూయలేదు. మీరు యింటికొచ్చాక ఆ పర్సు తీసుకోవచ్చని అనుకున్నాను. మిమ్మల్ని ఎవరూ అనుమానించరని నా ధీమా. నా జేబులో




బ్లేడుముక్కలున్నాయి. నన్ను వాళ్లు అనుమానిస్తారు! అందుకని అలా చేసి బస్సు వెనక్కు జరిగాను" అన్నాడు శంకరం.

"ఛీ! ఎంత నీచమైన పని చేశావురా!" అర్చాడు గోపాలరావు.

"నన్ను క్షమించండి! ఈ రోజున నా కళ్లు తెరవబడ్డాయి. ఇటువంటి నీచమైన జీవితంలోంచి బయటపడాలని నేను నిశ్చయించుకున్నాను. మళ్లా అటువంటి పని చేయను. మంచి వుద్యోగం కోసం అన్వేషిస్తాను," అని శంకరం ఏడ్వసాగాడు.

గోపాలరావు కొడుకుచెయ్యి పట్టుకుని లేవదీశాడు. అతడికేసి సూటిగా చూశాడు.

"శంకరం, నువ్వు అన్నట్లు నీలో పరివర్తన సంభవిస్తే నేను చాలా ఆనందిస్తాను. కొందరు చెడ్డపనులు చేస్తారు. ఎప్పుడో కళ్లు తెరిచి సత్యాన్ని గ్రహించి మంచి మార్గానికి మళ్లుతారు. ఇటుపైన ఏ పరిస్థితిలోనూ చెడ్డపని చేయనని నా చేతిలో చెయ్యేసి చెప్పు!" అర్చాడు గోపాలరావు.

తండ్రి చేతిలో చెయ్యేసి చెప్పాడు శంకరం. "మీ ఒంటిమీద పడిన దెబ్బలు ఆ సమయంలో నా హృదయంలోకి శూలాల్లా గుచ్చుకున్నాయి!" అన్నాడు శంకరం, కన్నీళ్లతో.

"గత ఆరు నెలల్లో నువ్వు నాకు మొత్తం మూడువేలు యిచ్చావు. అదంతా నా దగ్గర అలాగే వుంది. ఆ డబ్బును సమీపంలో వున్న ఇందిరా అనాథ ఆశ్రమానికి ఆకాశరామన్న విరాళంగా పంపిద్దాం," అన్నాడు గోపాలరావు.

కన్నీళ్లతో శంకరం తలాడించాడు.

